హైదరాబాద్ వార్త



# గల్లీకొక శంకర్‌దాదా..

-ఫేక్ డాక్టర్లు ..నకిలీ మందులు -బస్తీలు, కాలనీల్లో యథేచ్ఛగా వైద్యం

-రోగం ఏదైనా అందరికీ యాంటీబయోటిక్స్ అందజేత -మెడికల్ కౌన్సిల్, డ్రగ్ కంట్రోల్ దాడుల్లో వెలుగులోకి



**హైదరాబాద్, డిసెంబరు 3,ప్రభాతవార్త:** ఇటీవల తీవ్ర అనారోగ్యంతో నిమ్స్‌లో చేరిన ఓ మహిళకు వివిధ పరీక్షలు చేయగా మూత్ర పిండాలు వైఫల్యం చెందినట్లు వైద్యులు గుర్తించారు. వివిధ అనారోగ్య సమస్యల నుంచి ఎప్పటికప్పుడు ఉపశమనం పొందడానికి దీర్ఘకాలికంగా నొప్పి నివారణ మందులు వాడుతున్నట్లు తేలింది. స్థానికంగా ఉన్న వైద్యుడు అందించే ఈ వైద్యం... ఆమె కిడ్నీకు చేటు తెచ్చిందని తెలుస్తుంది. ఆమె మాత్రమే కాదు.. నిమ్స్‌కు మూత్రపిండాల వైఫల్యంతో వస్తున్న వారిలో 10నుంచి 15 శాతం కేసులు ఈ తరహావే ఉంటున్నాయని వైద్యులు చెబుతున్నారు. నిపుణులైన వైద్యుల సూచనలు లేకుండా నొప్పి నివారణ, యాంటాసిడ్ మందులు వాడటం చాలా ప్రమాదకరమని సూచిస్తున్నారు. అరకొర జ్ఞానంతో సేవలు అందించే ఆర్ఎంపీలు, నకిలీ వైద్యుల ప్రభావం ఇప్పుడు నగరంపై కూడా పడుతోంది. తాజాగా సంఘటనలే ఇందుకు ఉదాహరణగా నిలుస్తున్నాయి. కొందరు ఎంబీబీఎస్ డిగ్రీలే కాదు..స్పెషలైజన్స్ డిగ్రీలు పెట్టుకొని దర్జాగా వైద్య సేవలు అందిస్తున్నారు. ముఖ్యంగా నగరంలోని చిన్న చిన్న బస్తీలు, గల్లీలు, కాలనీలే అడ్డాలుగా క్లినిక్‌లు తెరిచి ఇలాంటి వారు వైద్య సేవలు అందిస్తున్నారు. తొలుత చిన్న చిన్న సమస్యలకు ప్రాథమిక వైద్యం అందించి రోగుల్లో నమ్మకం కల్పిస్తున్నారు. పది రకాల మందుల గురించి తెలుసుకొని లక్షణాలు బట్టి అవే రోగులకు అందిస్తుంటారు. యాంటీ బయోటిక్స్, పెయిన్ క్లిల్లర్స్ లాంటి మందులతో తాత్కాలికంగా ఉపశమనం దొరుకుతుండటంతో చాలా మంది వీటినే ఆశ్రయిస్తున్నారు. అంతేకాక ఇక్కడ తక్కువ ఫీజు కూడా ఇందుకు ఒక కారణం.

**నష్టం ఏంటి?**

యాంటీబయోటిక్స్ దీర్ఘకాలంగా వాడటం వల్ల కిడ్నీలే కాదు...శరీరంలోని ఇమ్యూనిటీపై కూడా ప్రభావం పడుతుందని వైద్యులుఅంటున్నారు. రోగి డాక్టర్ వద్దకు వెళ్లేముందు కనీస అవగాహన ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. పెయిన్ కిల్లర్ ఇవ్వాలంటే తొలుత సదరు రోగి కిడ్నీ పనితీరు తెలుసుకోవాలి. అప్పటికే కిడ్నీ జబ్బు ఉంటే పెయిన్ కిల్లర్ ఇస్తే చాలా ప్రమాదకరం. ఇక తక్కువ రక్తపోటు ఉన్న రోగికి కొన్ని రకాల పెయిన్ కిల్లర్స్ ఇవ్వకూడదు. గ్రేటర్ వ్యాప్తంగా దాదాపు చిన్న పెద్ద ఆసుపత్రులు 4 వేల వరకు ఉన్నాయి. ఇక ఒకే గదిలో కొనసాగే క్లినిక్‌లకు లెక్క లేదు. ఒక్కో గల్లీలో కనీసం 3 నుంచి 5 వరకు ఉంటున్నాయి. మొత్తం కలిపి వేల సంఖ్యలోనే ఉన్నాయి. ఏదైనా సంఘటన జరిగి అధికారులకు ఫిర్యాదులు వెళ్తే తప్ప. వీరిపై ఎలాంటి నిఘా ఉండటం లేదు.

**బోర్డులో ఒకటి.. లోపల మరొకరు**

నిబంధనల ప్రకారం ఆసుపత్రి పెట్టాలంటే కనీసం ఎంబీబీఎస్ ఉత్తీర్ణత పొంది ఉండాలి. ఎంబీబీఎస్ ధ్రువపత్రంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు దరఖాస్తు చేస్తే అన్నీ పరిశీలించిన తర్వాత మాత్రమే ఆసుపత్రికి అనుమతి ఇస్తుంది. అక్రమార్కులు నకిలీ ఎంబీబీఎస్ ధ్రువపత్రం సంపాదించి అధికారులను ఏమార్చి అనుమతి పొందుతున్నారు. మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి బోర్డు ఏర్పాటు చేసి ప్రముఖ వైద్యుల పేర్లు బోర్డు మీద రాయిస్తున్నారు. లోపలికి వెళ్తే ఆ వైద్యులు కన్పించడం లేదు. స్థానిక ప్రైవేటు ప్రాక్టీషనర్స్ దర్శనం ఇస్తున్నారు. అయితే తమ పరిధిలోని ఆసుపత్రులను జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాల్సి ఉంది. వైద్యానికి సంబంధించిన అంశాలే కాకుండా, ఫీజులు ఇతరత్రా వ్యహారాలన్నింటినీ ఓ కంట కనిపెట్టాలి. కానీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడం వల్లే ఆస్పత్రులను తరచూ తనిఖీలు చేయలేకపోతున్నామని కొన్ని జిల్లాల వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు.ఇదే నకిలీ డాక్టర్లకు కలిసి వస్తోంది.

**రుజువైతే ఏడేళ్లు శిక్ష..**

చాలామంది విదేశీ యూనివర్సిటీల్లో వైద్య విద్య పూర్తి చేసినట్లు పట్టాలు చూపుతున్నారు. ఆరా తీస్తుంటే అవన్నీ నకిలీ యూనివర్సిటీలే. కొందరైతే దొంగ డిగ్రీలు పుట్టిస్తున్నారు. నకిలీ డిగ్రీ అని తేలితే పోలీసులు 420 సెక్షన్ ప్రకారం కేసులు పెడుతున్నారు. దీనివల్ల ఏడేళ్ల శిక్ష పడే అవకాశం ఉంది. ఇక చికిత్స చేసి ఎవరి చావుకైనా కారణమైతే 302, 304(ఎ) సెక్షన్ల కింద కేసు పెడుతున్నారు. రుజువైతే ఏడేళ్లు అంతకంటే ఎక్కువ శిక్ష పడుతుంది.

**యథేచ్ఛగా నకిలీ మందుల దందా..**

నగరంలో నకిలీ, నాసిరకం ఔషధాల దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. ఉత్తుత్తి మందులను అమ్ముతూ కేటుగాళ్లు ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. రాష్ట్రంలో ఔషధ నియంత్రణ అధికారులు చేస్తున్న దాడుల్లో నకిలీ మందుల ముఠాలు భారీగా బయటపడుతున్నాయి. మార్కెట్‌లో పేరున్న కంపెనీల బ్రాండ్లతో నకిలీ ఔషధాలను తయారు చేస్తున్నారు. ఇటువంటి ఔషధాల్లో అసలు మందే ఉండటం లేదు. అలాగే కొన్నిసార్లు అసలు మందుకు బదులు వేరే ఔషధాన్ని నింపుతున్నారు. కొద్ది రోజుల కిందట ఔషధ నియంత్రణ అధికారుల దాడుల్లో ఓకంపెనీకి చెందిన అమోక్సిలిన్ బదులు పారాసిటమాల్ ఉంచి విక్రయిస్తున్నట్లు బయటపడింది. అలాగే ఔషధాల తయారీలో వినియోగించే రసాయనాలను సమపాళ్లలో కలపడం లేదు. ఇటువంటి ఔషధాలతో ఆరోగ్యం మరింత దెబ్బతింటోంది. రాష్ట్ర ఔషధ నియంత్రణ మండలి అధికారులు ఇటీవల పెద్ద ఎత్తున దాడులు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీల్లో నాణ్యత లేనివి, నకిలీ మందులు ఉత్తరాది రాష్ట్రాల నుంచి వస్తున్నట్లు గుర్తించారు. ముఖ్యంగా హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఘజియాబాద్, ఖాసీపూర్, ఉత్తరప్రదేశ్ నుంచి హైదరాబాద్‌కు నకిలీ ఔషధాలు వస్తున్నాయి. గతేడాది డిసెంబరు నుంచి ఇప్పటిదాకా రూ.కోట్ల విలువైన నకిలీ ఔషధాలను డీసీఏ అధికారులు పట్టుకున్నారు.



# నగర అభివృద్ధే లక్ష్యంగా...

ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లో రైజింగ్ వేడుకలు నిర్వహించారు. ఐమ్యాక్స్ సమీపంలోని హెచ్ఎండీఏ మైదానంలో జరిగిన ఈ వేడుకలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు కీలక ప్రాజెక్టులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. గ్రేటర్ పరిధిలో రూ.150 కోట్లతో పలు సుందరీకరణ పనులు, రూ.3,500 కోట్లతో రహదారి అభివృద్ధి పనులనకు సీఎం శంకుస్థాపన చేశారు. రూ.16.50 కోట్లతో నిర్మించిన భూగర్భ సంపులను ప్రారంభించారు. దేశంలోనే అతిపెద్ద ఎస్టీపీని సీఎం ప్రారంభించారు. కేబీఆర్ పార్క్ చుట్టూ చేపట్టబోయే 6 జంక్షన్ల అభివృద్ధి, 7 ఫ్లైఓవర్లు, అండర్ పాస్ పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులకు భద్రత కిట్లను అందించారు.

# నార్సింగిలో ప్రజాపాలన విజయోత్సవాలు

**నార్సింగి, డిసెంబర్ 3 ప్రభాతవార్త :** నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా మంగళవారం నిర్వహించిన "అర్బన్‌డే" కార్యక్రమం వేడుకగా జరిగింది. చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ అధ్యక్షతన సాగిన ఈ కార్యక్రమంలో కమీషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, కార్పోరేటర్లు అందరూ కలిసి పారిశుద్య విభాగంలో పని చేస్తున్న సిబ్బందికి పిపిఇ కిట్లు అందజేశారు. 10.మంది మున్సిపల్ పారిశుద్య కార్మికులకు సన్మానం చేసి, ప్రశంసా పత్రాలు ఇచ్చారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘాలకు రూ.కోటి చెక్కును అందజేశారు. మహిళలు సహజ సిద్దంగా లభించే ఆకులతో తయారు చేసిన విస్తరాకుల తయారీ స్టాల్‌ను, వివిధ రకాల ఆహార పదార్థాల స్టాల్‌ను ప్రారంభించారు. కమీషనర్ రూ.2వేలు వెచ్చించి ఈ విస్తరాకులను కొని, మధ్యాహ్న భోజనం కోసం వాడాలని సూచించారు. నార్సింగి ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో మున్సిపల్ సిబ్బందికి, ఇతర ప్రజలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. అనంతరం నార్సింగి మున్సిపల్ కార్యాలయం నుంచి వైఎస్సార్ చౌరస్తా వరకు భారీ ర్యాలీని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోపాల విజయ్ బాబు, కౌన్సిలర్లు లక్ష్మీ ప్రవళిక కిరణ్, లంకల పద్మ, గోపాల సునీత గణేష్, అమరేందర్‌రెడ్డి, మాజీ వైఎస్ ఎంపిపి లంకల పాపిరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దొబ్బ లక్ష్మణ్, మేనేజర్ యోగేష్, అకౌంట్ అధికారి కృష్ణయ్య, టిపిఎస్ మణిహారిక, టిఎంసి స్వామి, తదితరులు పాల్గొన్నారు.



నార్సింగిలో అర్బన్‌డే వేడుకల సందర్భంగా స్వయం సహాయక సంఘాలకు రూ.కోటి చెక్కును అందజేస్తున్న దృశ్యం.

**మణికొండలో :** మణికొండ మున్సిపాలిటీలో చైర్మన్ కె.నరేందర్ ముదిరాజ్, వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, కమీషనర్ ప్రదీప్ కుమార్‌ల నేతృత్వంలో ప్రజాపాలన విజయోత్సవాలు వైభవంగా జరిగాయి. గోల్డెన్ టెంపుల్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు 2.కే రన్ నిర్వహించారు. మున్సిపల్ సిబ్బందిని సన్మానించారు. ఉచిత వైద్య శిబిరంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శ్రీధర్, డిఇ శివసాయి, టిపిఓ సంతోష్ సింగ్, కౌన్సిలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన భోజనం, విద్య : ఎమ్మెల్యే శ్రీగణేష్

-మహేంద్రహిల్స్‌గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ అనుదీప్

**కంటోన్మెంట్, డిసెంబరు 3, ప్రభాతవార్త :** గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతో పాటు విలువలతో కూడిన విద్యను అందించేందుకు సిఎం రేవంత్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రయోజకులు కావాలని కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. మంగళవారం మహేంద్రహిల్ స్‌లోని సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల హై స్కూల్, జూనియర్ కళాశాలను హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి ఆకస్మిక తనిఖీ చేపట్టారు. గురుకుల పాఠశాలల్లోని ప్రువిజన్ రూమ్, స్టోర్ రూమ్, డార్మెంటరీ, కిచెన్, డైనింగ్ హాళ్లను తనిఖీ చేశారు. గురుకుల పాఠశాలకు సరఫరా చేస్తున్న కూరగాయలను, బియ్యం, పప్పు, నూనె,గ్రుడ్లు, పండ్లు, వంటి ఆహారపదార్థాలను తనిఖీ చేశారు. భోజనంలో విద్యార్థులకు అందజేస్తున్న కూరలను పరిశీలించారు. నెలలో నాలుగు సార్లు చికెన్, ఒకసారి మటన్, 20 సార్లు గ్రుడ్లు అందజేస్తున్నామని ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణులై మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో మారేడ్‌పల్లి తహశీల్దార్ బీమయ్య గౌడ్, గురుకుల పాఠశాలల స్టేట్ ఆఫీసర్ బీమయ్య, ప్రిన్సిపాల్ శీలం సునీత, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ జయకుమారి, పి.డి. రూత్ మణిలతో పాటు కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

**విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఎమ్మెల్యే శ్రీగణేష్, కలెక్టర్**

మహేంద్రహిల్స్‌లో సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో చదువుతున్న 650 మంది విద్యార్థినీలతో కలిసి కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిలు భోజనం చేసి ఆహార నాణ్యత పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు.

# ఘనంగా వ్యవసాయ విద్యా దినోత్సవం





**అత్తాపూర్ డిసెంబరు3,ప్రభాతవార్త :** భారతదేశ మొదటి రాష్ట్రపతి మరియు వ్యవసాయ శాఖ మంత్రి డాక్టర్ రాజేంద్రప్రసాద్ జయంతిని పురస్కరించుకొని వ్యవసాయ విద్యా దినోత్సవంను వ్యవసాయ కళాశాల రాజేంద్రనగర్ లో ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ మరియు పరిశోధన సంచాలకులు డాక్టర్ రఘురామి రెడ్డి, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ దీ. శివాజీ హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సి. నరేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో వివిధ డిపార్ట్మెంట్స్ ఏర్పాటుచేసిన స్టాళ్ళను ప్రారంభించి సందర్శించారు. అలాగే వివిధ పాఠశాలల నుండి విచ్చేసిన విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతి విద్యార్థి వ్యవసాయం పైన మక్కువ పెంచుకోవాలని, చిన్నతనం నుండి వ్యవసాయం యొక్క ప్రాముఖ్యతను తెలుసుకొని మంచి పౌరులుగా మారాలని ముఖ్య అతిథి తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించుటకు శివి, శివీదీ విద్యార్థులు స్టాళ్ళను ఏర్పాటు చేసినందుకు వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ పాఠశాలల నుండి విచ్చేసిన విద్యార్థులకు వక్తృత్వ మరియు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి గెలిచిన వారికి ప్రోత్సాహక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్ నరేందర్ రెడ్డి, కళాశాల ఓ.ఎస్.ఏ డాక్టర్ ప్రశాంత్ వివిధ శాఖల హెడ్స్, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. దాదాపు 27 పాఠశాలల నుండి 2074 మంది విద్యార్థులు వివిధ స్టాళ్ళను సందర్శించి, వ్యవసాయ కళాశాల క్షేత్రాలు సందర్శించి ఆసక్తిగా వివిధ అంశాలు తెలుసుకున్నారు.

# కంచె లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రజలకు ఇబ్బందులు



ఘాన్సీ బజార్ హైకోర్టు రహదారిలో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ కంచె లేని దృశ్యం

**చార్మినార్,డిసెంబరు 3 ప్రభాతవార్త :** ఘాన్సీ బజార్ డివిజన్ పరిధిలోని హైకోర్టు రహదారిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె సౌకర్యం లేనందునప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు.విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచెను నెల కొల్పాలని పలు మార్లు విద్యుత్ అధికారులకు మొరపెట్టుకున్న ఫలితంలేక పోయిందని ప్రజలు తమ విచారాన్ని వ్యక్తం చేశారు.హైకోర్టు రహదారిలో నిత్యం వేలాది వాహనాలు నడుస్తుంటాయి.అదే విధంగా రహదారి వాహనాలతోరద్దీగా ఉంటుంది.రోడ్డుకు ఆనుకుని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆంధోళన చెందుతున్నారు.విద్యుత్‌ట్రాన్స్ ఫార్మర్ ప్రక్కనే ఉన్న పోస్టాఫీస్‌కు ప్రతీ రోజు ప్రజలు వస్తున్న సమయంలో నానా అవస్థలు పడుతున్నారు.వర్షం పడే సమయంలో వాహనదారులు ఈరహదారిలో ప్రయాణం చేయాలంటేనే సందేహిస్తున్నారు.రాత్రి వేళల్లో చీకటిలో రహదారిని ఆనుకుని ఉన్న విద్యుత్ వైర్లు కనిపించక పోవటంతో నడిచి వెళ్లె పాదచారులు భయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి హైకోర్టు రహదారిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచెను ఏర్పాటు చేయాలని ఘాన్సీ బజార్ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# 6న మంత్రితో చర్చలనంతరం కార్యాచరణ ప్రకటిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న బి.వెంకటేశం

**సైఫాబాద్, డిసెంబరు 3 ప్రభాతవార్త:** తెలంగాణ ఆటో, క్యాబ్స్, డ్రైవర్స్ సంఘాల జెఎసి ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన నిర్వహించతలపెట్టిన రాష్ట్ర వ్యాప్త ఆటో బంద్ యధావిధిగా కొనసాగుతుందని జెఎసి ప్రకటించింది. ఈ నెల 6వ తేదీ సాయంత్రం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చర్చలకు ఆహ్వానించారని, చర్చల అనంతరం భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామని జెఎసి నాయకులు తెలిపారు. మంగళవారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెఎసి కన్వీనర్ బి.వెంకటేశం మాట్లాడుతూ దీర్ఘకాలికంగా ఉన్న ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కారం కోసం ఈ నెల 7న రాష్ట్ర వ్యాప్త బంద్‌కు పిలుపు ఇవ్వడం జరిగిందని, కాగా నేడు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో కలిసి తాము మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలవడం జరిగిందని, ఈ సందర్భంగా మంత్రి ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కారం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, 6వ తేదీన సచివాలయంలో చర్చలకు రావాలని ఆహ్వానించడం జరిగిందని చెప్పారు. ఈ సమావేశంలో జెఎసి నాయకులు వి.మారయ్య, వి.ప్రవీణ్, ఎ. సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తాళాలు పగలగొట్టి దోచుకుంటున్న ముఠా ఆటకట్టు

-రూ.50లక్షల విలుగల బంగారు,వెండి ఆభరణాల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలను పరిశీలిస్తున్న బాలానగర్ డిప్యూటీ పోలీసు కమిషనర్ కె.సురేశ్‌కుమార్ , ఇతర అధికారులు

**కుత్బుల్లాపూర్, డిసెంబరు 3 ప్రభాతవార్త :** డ్రైవర్లుగా పనిచేస్తూ ఇంటికి ఏవిధంగా కన్నం వేయొచ్చనే ఆలోచనతో ఏకంగా యాభై లక్షల విలువగల బంగారంతో ఉడాయించేందుకు యత్నించిన ముగ్గురు దొంగలను కూకట్‌పల్లి పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. ఈమేరకు బాలానగర్ డిప్యూటీ పోలీసు కమిషనర్ కె.సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో మగళవారం విలేకరుల సమావేశంలో వివరాలువెల్లడించారు. కూకట్‌పల్లి పరిది జయనగర్‌కు చెందిన కామాని మధుసూధన్‌రావు తన కూతురు ఇంటికని గతనెల 28న ఇంటికి తాళంవేసి వెళ్లిపోయారు. ఇదే అదనుగా డ్రైవరుగా పనిచేస్తున్న కూకట్‌పల్లి విలేకానంనగర్‌కు చెందిన సంపంగి లక్ష్మయ్య(44), పాపారాయుడు నగర్‌కు చెందిన గుమ్మడి నాగశంకర్(23), గుమ్మడి మురళి(54)లు కలిసి అదను చూసుకుని ఈనెల ఒకటవతేదిన తాళం వేసిఉన్న ఇంటి తాళాలు ఇనుపరాడ్‌తో పగలగొట్టి ఇంట్లో గల బంగారం, వెండి, వజ్రాలను దొంగిలించుకుని పోయారు. తెల్లవారు వాచ్‌మెన్ ఇది గమనించి యజమానికి సాచంర అందించగా వచ్చి పరిశీలించిన మధుసూధన్‌రావుకు ఇంట్లో దాచిన 75తులాల బంగారు నల్లెస్‌లు, గాజులు, రింగులు, 175గ్రాముల రత్నాలు, బ్రాస్‌లెట్లు దొంగిలించినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదుచేశారు. కూకట్‌పల్లి సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ కె.ముత్తు నాయకత్వంలో కేసు నమోదుచేసుకుని ఉన్నతాదికారులకు సమాచారం అందించగా సైబరాబాద్ పోలీసు కమిషనర్ ఆదేశాలమేరకు బాలానగర్ డిసిపి సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో స్పెషల్‌టీంను నియమించారు. దీనితో బాగంగా క్రైమ్‌విభాగం డిసిపి కె.నర్సింహ్మా, కూకట్‌పల్లి ఎసిపి శ్రీనివాసరావు, సిసిఎస్ ఎసిపి కలింగరావు, కూకట్‌పల్లి పోలీసు ఇన్‌స్పెక్టర్ కె.ముత్తు, డిఎస్ఐ ఎస్. సతీష్‌రెడ్డి, డిటెక్ట్యూ ఇన్‌స్పెక్టర్ బి.వెంకటేశంల తోపాటు కానిస్టేబుళ్ల బృందం పూర్తివిచారణ జరిగి నిందుతులను అదుపుతోకి తీసుకుని సొత్తును స్వాదీనంచేసున్నారు.

కేసును పరిష్కరించడంతో చాకచక్యం ప్రదర్శించిన పోలీసులను ఈసందర్భంగా బాలానగర్ డిసిపి కె.సురేశ్‌కుమార్ నగదు పారితోసికాన్ని అందజేసి అభినందించారు.

## మెట్రో రైల్ భవన్‌లో ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

**హైదరాబాద్, డిసెంబరు 3 ప్రభాతవార్త**

తెలంగాణ ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల సందర్భంగా హైదరాబాద్ మెట్రో రైల్ మంగళవారం బేగంపేట్ లోని మెట్రో రైల్ భవన్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించింది. మెట్రో రైల్ ఎండి ఎన్వీఎస్ రెడ్డి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. కిమ్స్, సన్ షైన్ హాస్పిటల్ బేగంపేట్ వైద్య బృందం సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహించారు. మెట్రో రైల్ సంస్థ అధికారులు, సిబ్బంది ఈ శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. దంత పరీక్షలు, కంటి పరీక్షలు, సాధారణ వైద్య పరీక్షలను కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్స్ వైద్యులు నిర్వహించారు. హెచ్‌ఎంఆర్‌ఎల్ సీనియర్ అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### జీహెచ్‌ఎంసీలో బిల్లులు రావడం లేదు : కాంట్రాక్టర్లు

**తార్నాక, డిసెంబరు 3 ప్రభాతవార్త:** ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా తమకు నెలల తరబడి బిల్లులు రాక అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నామని జీహెచ్‌ఎంసీ కాంట్రాక్టర్లు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ.రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.సురెందర్ సింగ్, సికింద్రాబాద్ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గంటి కోట ఆనంద్ మాట్లాడుతూ బిల్లులు రాక ఆర్థికంగా అనేక రకాల ఇబ్బందులు పడుతున్నామని, హాస్పిటల్ అవసరాల కోసం కొందరు, పిల్లల స్కూల్ ఫీజుల కోరకు కొందరు, పిల్లల పెళ్లిళ్ల కోసం ఇలా ఎంతో మంది అనేక ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్లులు రాక అనేక అవసరాల కోసం కాంట్రాక్టర్లు వివిధ రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఈ సంవత్సరం మార్చి నెల బిల్లులు చెల్లించేలా చూడాలని లేకుంటే జీ హెఎంసీ కార్యాలయం ముందు ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

### సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం వర్గీకరణ అమలు చేయాలి




సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కాశీం.

**సైఫాబాద్, డిసెంబరు 3 ప్రభాతవార్త:**

ఎస్సీ వర్గీకరణ కోసం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని మాదిగ మేధావులు ఫోరం డిమాండ్ చేసింది. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను వర్గీకరణ చేసుకోవచ్చునని గత ఆగస్టు 1వ తేదీన సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని ఫోరం నాయకులు తెలిపారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫోరం గౌరవ అధ్యక్షుడు ప్రొఫెసర్ సి.కాశీం, అధ్యక్షుడు డా.అరెపల్లి రాజేందర్ మాట్లాడుతూ ఎస్సీలకు సామాజిక న్యాయం జరగాలంటే ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ అమలు జరగాలని న్యాయమూర్తులు అభిప్రాయాలను వ్యక్తం చేశారని, తీర్పుకు అనుకూలంగా సిఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా మద్దతు ప్రకటించారని గుర్తు చేశారు. అమలు కోసం క్యాబినేట్ సబ్ కమిటీ తోపాటు ఏకసభ్య కమిషన్‌ను కూడా ఏర్పాటు చేయడం జరిగిందని వారు తెలిపారు. కమిషన్ నివేదిక ఆధారంగా ప్రభుత్వం వర్గీకరణకు చట్టబద్దత కల్పించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వర్గీకరణ కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన ఆర్డినెన్స్ ద్వారా అనేక మంది మాదిగలు, ఉపకులాలు ఎంతో అభివృద్ధి చెందారని వారు గుర్తు చేశారు. వర్గీకరణతో మాదిగలకు, ఉప కులాలకు ఎంతో మేలు జరుగుతుందని, వర్గీకరణకు మాలలు అడ్డు తగలరాదని హెచ్చరించారు. ఈ సమావేశంలో సమితి నాయకులు వీరాస్వామి, సాయిబాబా, నర్సింహ్మా, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

### వర్గీకరణ జరిగేంతవరకు పోరాటం కొనసాగిస్తాం

**సైఫాబాద్, డిసెంబరు 3 ప్రభాతవార్త:** ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ అమలు జరిగేంతవరకు తాము పోరాటం కొనసాగిస్తామని దళిత జన సమితి ప్రకటించింది. వర్గీకరణ కోసం గత మూడు దశాబ్దాలుగా మాదిగలు పోరాటాలు చేస్తున్నారని, సుప్రీంకోర్టు వర్గీకరణకు రాజ్యాంగబద్దమైన తీర్పు ఇచ్చిందని సమితి నాయకులు తెలిపారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమితి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొజ్జ యాదగిరి, పి.చంద్రమౌళి, కార్యనిర్వాహక అధ్యక్షుడు బొజ్జ రమేష్ తదితరులు మాట్లాడుతూ వర్గీకరణ విషయంలో సిఎం రేవంత్‌రెడ్డి ఏలాంటి జాప్యం చేయకుండా అమోదం తెలపాలని కోరారు. వర్గీకరణ అమలు జరిగితే మాదిగలకు విద్యా, ఉద్యోగ తదితర రంగాలలో అభివృద్ధి చెందుతారని చెప్పారు. వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు సభలు, సమావేశాలు, ధర్నాలు చేపట్టిన వర్గీకరణ అమలును అడ్డుకోలేరని, వర్గీకరణ జరిగితే మాల, మాదిగలు అన్నదమ్ములుగా కలిసి అభివృద్ధి ఫలాలను సాధించుకోవచ్చునని వారు సూచించారు. మేధావులు అని చెప్పుకుంటున్న మాలలు, ఎమ్మెల్యే జి.వివేక్ వెంకటస్వామి తదితరులు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకించడం దుర్మార్గమన్నారు. ప్రైవేటు రంగంలో కూడా ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో సమితి నాయకులు గంగాధర్, అశోక్, బొజ్జ రాకేష్, చొప్పరి బాలన్న,సంపత్,కుమార్ పాల్గొన్నారు.

## పడకంటి బ్రహ్మాచారికి ఘననివాళులు



పడకంటి బ్రహ్మాచారికి నివాళులర్పిస్తున్న సనాతన హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి ప్రతినిధులు

**హైదరాబాద్, డిసెంబరు 3 ప్రభాతవార్త**

ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన పడకంటి బ్రహ్మాచారికి సనాతన హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి ఘనంగ నివాళులర్పించింది. మంగళవారం అంబర్‌పేటలో సంస్థ కార్యాలయం వద్ద బ్రహ్మాచారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ పుట్టి యాదగిరి ముదిరాజ్,అధ్యక్షుడు యామన్‌సింగ్, కోశాధికారి కాశిబుగ్గ బాబన్న, అంబర్‌పేట అధ్యక్షుడు విజయ్‌కుమార్,ప్రధాన కార్యదర్శి శ్రావణ్ కుమార్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అంజయ్య,నర్సింహాచారి, వినోద్, లక్ష్మణ్‌గౌడ్, రామ్మోహన్‌గౌడ్, రాముడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్రహ్మాచారితో తమకున్న అనుబంధాన్ని, సనాతన హిందూ దేవాలయాల పరిరక్షణకు ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు.

## 10 నెలల్లోనే 50 వేల ఉద్యోగాలు, 6 గ్యారెంటీల అమలు : ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్, డిసెంబరు 3, ప్రభాతవార్త :** ప్రభుత్వం దివ్యాంగుల సాధికారత కోసం ఎంతో కృషి చేస్తుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్, రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ శ్రీకాంత్ గౌడ్‌లు తెలిపారు. కాంగ్రెస్ ప్రజా పాలన విజయోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం కంటోన్మెంట్ నియోజకవర్గం మారేడ్‌పల్లి మల్టిపర్పస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల వేడుకలకు ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వాలు చేపట్టలేని సంక్షేమ పథకాలు 10 నెలల్లోనే కనీ, వినీ ఎరుగని రీతిలో అభివృద్ధి జరిగిందన్నారు. ప్రజలకు అనుగుణంగా పాలన అందిస్తున్నామన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన 3 గ్యారెంటీలను అమలు చేస్తున్నామన్నారు. గత 10 యేండ్లలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం 10 శాతం ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. రూ.7 లక్షల కోట్ల అప్పులు చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 10 నెలల్లోనే 50 వేల ఉద్యోగాలు ఇప్పించడం జరిగిందన్నారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా 202 మంది దివ్యాంగులకు రూ. 18 లక్షల విలువ చేసే 19 రకాల పరికరాలను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి, బేగంపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక, కాంగ్రెస్ నాయకులు



దివ్యాంగులకు ట్రై సైకిళ్లను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్, బీసీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ శ్రీకాంత్ గౌడ్ తదితరులు

చిత్రబోయిన వైష్ణవి, సంతోష్ యాదవ్, సంకి రవిందర్ బాబు, శ్యామ్ సన్‌రాజు, నాగినేని సరిత, రేపాల వెంకటేశ్వర్లు, తేలుకుంట సతీష్‌గుప్త, రంగ రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

**పారిశుధ్య సిబ్బందికి ఉచిత వైద్య శిబిరం . ..**

ప్రజా పాలన విజయోత్సవ వేడుకలను పురస్కరించుకొని శనివారం మారేడ్‌పల్లి మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో జిహెచ్‌ఎంసి పారిశుధ్య సిబ్బందికి నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని బీసీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ శ్రీకాంత్ గౌడ్,డిప్యూటీ కమిషనర్ సమ్మయ్యలతో కలిసి ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రారంభించారు.

## దివ్యాంగుల కోసం ఇన్నోవేటివ్ ఉపకరణాలు తయారు చేయాలి

**హైదరాబాద్, డిసెంబరు 3,ప్రభాతవార్త:**

దివ్యాంగులు నిత్య జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఉపయోగపడే ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని తెలంగాణ ఎమర్జింగ్ టెక్నాలజీ డైరెక్టర్ రమాదేవి లంక అన్నారు. మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా టీ వర్క్స్‌లో స్టార్ట్ అప్ కంపెనీల కోసం ఆక్సిలరేటర్ ప్రోగ్రామ్ ను ఆమె టీ వర్క్స్ సీఈవో జోగింధర్ తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగుల కోసం సరికొత్త పరికరాలు, సాఫ్ట్‌వేర్‌లను రూపొందించాల్సిన అవసరం ఉందని దీనికోసం స్టార్టప్ కంపెనీలు, ఈ రంగంలో ఉన్న కంపెనీలు మరింతమంది ముందుకు రావలసిన అవసరం ఉందన్నారు. మొన్నటి పారా ఒలంపిక్స్ లో కూడా దివ్యాంగులు పతకాలు సాధించి మన దేశానికి గర్వకారణంగా నిలిచిన విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. ప్రభుత్వం స్టార్ట్ అప్ కంపెనీలకు బాసటగా నిలుస్తుందని వారికి కావలసిన అన్ని వసతులను సౌకర్యాలను కల్పిస్తుందని మరోవైపు స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు రావాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం పెంచేలా కంపెనీలు టెక్నాలజీని




కార్యక్రమంలో పాల్గొన్న డైరెక్టర్ రమాదేవి, టివర్క్స్ సిఈవో జోగింధర్ తదితరులు

ఉపయోగించి వారికి ఉపయోగకరమైన పరికరాలను తయారు చేయాలనీ సూచించారు. ప్రస్తుత ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ తో ఎన్నో అద్భుతాలు చేయవచ్చునని ఆదిశగా కంపెనీలు వికలాంగుల కోసం ఇన్నోవేటివ్ ఉపకరణాలను తయారు చేసే విధంగా ఆలోచించాలని అన్నారు. అనంతరం ఆమె ఈ సమ్మిట్ లో పాల్గొన్న పలు సంస్థల ప్రతినిధులకు ప్రశంసా పత్రాలు అందించారు. డిసెంబర్ 21వ తేదీ వరకు స్టార్టప్ కంపెనీల నుంచి ఎక్సెలరేటర్ ప్రోగ్రాం కి దరఖాస్తు చేసుకోవచ్చని జనవరి 14 నుంచి ఇది మొదలవుతుందని పేర్కొన్నారు.

## ఉద్యమకారులకు 250 గజాల స్థలం..నిర్మాణానికి రూ.25లక్షలు ఇవ్వాలి

**హైదరాబాద్, డిసెంబరు 3,ప్రభాతవార్త:**

తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటిస్థలం ఇంటి నిర్మాణానికి రూ.25లక్షలు ఇవ్వాలని ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెలకాంతం ప్రభుత్వానికి విజనప్తి చేశారు. ఈమేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ, తెలంగాణ ఉద్యమకారుల సంఘం, ఓయూ జేఏసీల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. దీనికి గజ్జెలకాంతంతోపాటు ఎస్సీ కార్పోరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి తదితరులు హాజరై ప్రసంగించారు. ఈసందర్భంగా గజ్జెలకాంతం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఉద్యమకారుడికి 25వేలు పెన్షన్, అర్హతను బట్టి ఉద్యగాలు ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వం ఉద్యమకారులను నమ్మించి మోసం చేసిందని మండిపడ్డారు. తెలంగాణ తమ వల్లే వచ్చిందని, కెసిఆర్ చావునోట్లో తలపెట్టాడని ప్రచారం చేస్తారని అవన్నీ అవాస్తవాలు అన్నారు. ఎంతోమంది ఉద్యమకారులు బలిదానాలు, పోరాటాల వల్లే తెలంగాణ వచ్చిందన్నారు. కెసిఆర్ కుటుంబం రాజకీయాలకోసమే తెలంగాణ సెంటిమెంట్‌ను వాడుకున్నారని మండిపడ్డారు. తెలంగాణ రావాలన్న ఆలోచన అప్పుడు ఆకుటుంబానికి అసలే లేద




ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న గజ్జెల కాంతం, పిడమర్తి రవి తదితరులు

న్నారు. చాలామంది కేసీఆర్ ఏ సావునోట్లో తలకాయ పెట్టిండని చెప్పారని అప్పుడు జరిగినవన్నీ డ్రామాలేనని పేర్కొనానరు కేసీఆర్ నిజంగా దీక్ష చేస్తే చనిపోయే వాడని.కవితక్క జ్యూస్, గ్లూకోస్ అందించిచడం వల్లే బయటపడ్డాడన్నారు. నాడు తెలంగాణ పొలిటికల్ జేఏసీని సైతం తమ చెప్పుచేతల్లో పెట్టుకుని ఇతర పార్టీలను దగ్గర కురాకుండా చేశారన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు కోలా శ్రీనివాస్, రామారావుగౌడ్, కోలా శ్రీనివాస్, పాలకుర్తి కృష్ణ, సముద్రాల అజయ్, దేవరకొండ నరేష్, బొరెల్లి సురేష్, నరాల సుధాకర్, కొమ్ము తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్ కౌన్సిల్‌లో అడిగిన ప్రశ్నలను దాట వేశారు : బిజెపి కార్పొరేటర్లు

**సరూర్‌నగర్, డిసెంబరు 3 ప్రభాతవార్త:**

బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో తాము లేవనెత్తిన అంశాలు, ప్రశ్నలపై మేయర్ గానీ కమీషనర్ గానీ సరైన సమాధానాలు చెప్పకుండానే దాటవేశారని బిజెపికి చెందిన కార్పొరేటర్లు అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం గుర్రంగూడలో సమావేశమైన బిజెపి ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్‌రెడ్డి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ దడిగ శంకర్, కార్పొరేటర్లు గడ్డం లక్ష్మారెడ్డి తదితరులు సోమవారం జరిగిన కౌన్సిల్ తీరును తప్పుపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.52 కోట్లకు సంబంధించి ఆమోదం కోసం జరిగిన కౌన్సిల్ తీరు వాస్తవానికి విరుద్ధంగా జరిగిందని ఆరోపించారు. వార్షిక బడ్జెట్ మొత్తం రూ.82 కోట్లు అయితే గత రెండు సమావేశాల్లోనే దాదాపు 100 కోట్లకు సంబంధించి గత తీర్మాణాల్లో ఎన్ని పనులు పూర్తి అయ్యాయి.. ఇంకా ఎన్ని పనులు జరగాల్సి ఉంది.. ఎంత మేర బిల్లులు చెల్లించాలనే దానిపై తాము అడిగిన ప్రశ్నలకు మేయర్, కమీషనర్‌లు దాటవేశారని వారు పేర్కొన్నారు. తాజా జెండాలోని కొన్ని పనులను టెండర్ లేకుండానే ముందస్తుగా పనులు పూర్తి చేశారనీ దీనికి కౌన్సిల్ ఆమోదం ఎందుకని వారు ప్రశ్నించారు. గత 2023లో బాలాపూర్ శివాజీ చౌక్ నుండి గణేష్ చౌక్ వరకు రూ.15 లక్షలతో రోడ్డును నిర్మిస్తే 2024లో హెచ్‌ఎండిఎ నిధులు రూ.1.25 కోట్లతో అదే రోడ్డును



బడంగ్‌పేట్ కౌన్సిల్ సమావేశం తీరును తప్పుపడుతున్న బిజెపి కార్పొరేటర్లు

అభివృద్ధి చేశారనీ అయితే సోమవారం జరిగిన కౌన్సిల్ మీటింగ్‌లో అదే రోడ్డుకు నిధులు కేటాయించడంలో ఆంతర్యం ఏమిటని వారు ప్రశ్నించారు. గడచిన ఐదు సంవత్సరాల నుండి కార్పొరేషన్‌లో ఓపెన్ స్థలాలు, పార్కులు ఆక్రమణలకు గురవుతున్నా.. వాటిపై పలు ఫిర్యాదులు వస్తున్నా మేయర్ స్పందించకపోవడాన్ని తా ము తప్పుపడుతున్నామని వారు స్పష్టం చేశారు. కార్పొరేషన్‌లో జరుగుతున్న అన్యాయాలను బిజెపి తరపు న తీవ్రంగా ఖండిస్తు న్నామని వారు వెల్లడించారు. వీటిపై మేయర్, కమీషనర్‌లు సమాధానాలు చెప్పాలనీ లేని పక్షంలో బిజెపి తరపున భవిష్యత్ కార్యాచరణతో ముందుకు పోతామని వారు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, నాయకులు గౌర శ్రీనివాస్, నిమ్మల శ్రీకాంత్‌గౌడ్, రామిడి వీరకర్ణారెడ్డిలు పాల్గొన్నారు.

## మనోహరంగా ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతి

-సంగీత స్వరసాల ఘంటసాల

: ప్రభుత్వ పూర్వ సలహాదారు

డా. కె.వి.రమణాచారి

**రవీంద్రభారతి, డిసెంబరు 3 ప్రభాతవార్త :**

పాటకు సంగీతం ప్రాణమని, ఆ సంగీత స్వరసాల, స్వరహేళ ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి యావత్ తెలుగుజాతికే గొప్పపండుగని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి అన్నారు. స్వరంలో గాంభీర్యం, మాధుర్యం, జీవం కలబోసిన నిలయం ఘంటసాలని అభివర్ణించారు. గాంధర్వదేవత కొలువుతీరిన కలికిముత్యాల సాల ఘంటసాల ఎంతో ఇంపు సొంతుగా పాడతారని, పద్యమాలపించినా, గద్యం చదివినా శృతిల యబద్ధంగా ఉంటాయని, ఆయన ఎల్లకాలం మనవెంట ఉంటారని స్పష్టం చేశారు.



ఘంటసాల పురస్కారస్వీకర్తలతో కె.వి.రమణాచారి, పార్వతీశం, రఘురామ్, మణిశాస్త్రి తదితర అతిథులు

కిన్నెర ఆర్ట్ థియేటర్స్, నాదవినోద సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రదాన మందిరంలో మంగళవారం రాత్రి ఓలేటి పార్వతీశం సభాధ్యక్షతన పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 102 జయంతి మనోహరంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ గాయని మణిశాస్త్రి బృందం సమర్పణలో గౌరమ్మా నీ మొగుడెవరమ్మా .... శీర్షికన వర్ధమాన గాయకుల తో సుమధురంగా ఘంటసాల గానంచేసిన ఆణిముత్యా ల్లాంటి పాటల ఆలాపనతో సాగిన ఘంటసాల సంగీత విభావరి ఆహుతులకు వీనులవిందు చేసింది. అనంతరం డా. ఓలేటి పార్వతీశం అధ్యక్షతన జరిగిన సభాకార్య క్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. కె.వి.రమణాచారి సంస్థ కార్యదర్శి మద్దాళి రఘురామ్, గాయని మణిశాస్త్రి తదితరులతో కలిసి ప్రముఖ గాయనీమణులు సురేఖ మూర్తి, విజయలక్ష్మిలను ఘనంగా సత్కరించి ఘంటసాల పురస్కారాలను ప్రదానం చేసి ఎంతగానో అభినందించారు.

## బండ్లగూడలో పండగలా ప్రజాపాలన విజయోత్సవాలు

- ఉత్తమ పారిశుధ్య కార్మికులకు ఘన సన్మానం
- ప్రజాపాలన విజయోత్సవాలను అధికార పార్టీ నేతలే అడ్డుకోవడం సిగ్గుచేటు : సాగర్‌గౌడ్

**నార్సింగి, డిసెంబర్ 3 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలో ప్రజాపాలన విజయోత్సవాలు పండగలా జరుగుతున్నాయి. మేయర్ మద్దెల లతా ప్రేమ్‌గౌడ్ అధ్యక్షతన మంగళవారం అర్బన్‌డే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ లతాగౌడ్, డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, కమీషనర్ శరత్‌చంద్ర, కార్పోరేటర్ సాగర్‌గౌడ్ తదితరులు మహిళా గ్రూపులకు, వీధి విక్రయ దారులకు ఋణాలకు సంబంధించిన చెక్కులు అందజేశారు. మహిళలు తయారు చేసిన పలు రకాల ఆహార పదార్థాలకు సంబంధించిన స్టాల్స్‌ను సందర్శించి అభినందించారు. పారిశుద్య సిబ్బందికి పిపిఇ కిట్లు అందజేశారు. ఉత్తమ పారిశుధ్య కార్మికులను సన్మానించారు. 15,16.డివిజన్ల పరిధుల్లో సీసీ రోడ్డు పనులకు శంఖుస్థాపనలు చేశారు. అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా రంగారెడ్డి జిల్లా పిడి మల్లీశ్వరి, టిజి బ్యాంకు మేనేజర్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**అధికార పార్టీ నేతలు ప్రజాపాలనను అడ్డుకోవడం సిగ్గుచేటు : సాగర్‌గౌడ్**

బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్వహిస్తున్న "ప్రజాపాలన విజయోత్సవాల"ను అడ్డుకోవడం సిగ్గుచేటని కార్పోరేటర్ సాగర్‌గౌడ్ పేర్కొన్నారు. నాయకుల తీరును నిరసిస్తూ సాగర్‌గౌడ్ పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళ



బండ్లగూడ కార్పోరేషన్ పరిధిలో రోడ్డు పనులకు శంఖుస్థాపన చేస్తున్న మేయర్ లతాప్రేమ్‌గౌడ్, డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి తదితరులు.

వారం కార్పోరేషన్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రి ముందున్న స్థలంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ భవనం భూమి పూజ కార్యక్రమం ఉందని కమీషనర్ శరత్‌చంద్ర తెలిపారని, అందుకు తగ్గట్టుగానే ఆ స్థలంలో ఏర్పాట్లు కూడా చేయడం జరిగిందన్నారు. ప్రారంభోత్సవం చేసేందుకు వెళ్తుండగా ముదిరాజ్ కార్పోరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, మేయర్ లతా ప్రేమ్‌గౌడ్‌లు వచ్చి ఈ పని చేయకుండా అడ్డుకున్నారని, దీంతో కమీషనర్ సైతం వెనక్కి తగ్గి, రోడ్డుపై ప్రారంభించి మమా అనిపించుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ స్థలం ప్రభుత్వానిదని, దీనిలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని గత మేయర్ మహేందర్‌గౌడ్ హయాంలో కౌన్సిల్ తీర్మాణం చేశామన్నారు. ఓ ప్రైవేటు పాఠశాల పార్కింగ్ కోసమే అధికారిక కార్యక్రమంను అడ్డుకున్నారని ఆరోపించారు. ఎవరు అడ్డు పడ్డా వెనక్కి తగ్గేది లేదని, త్వరలోనే ఇక్కడ కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేసితీరుతామని సాగర్‌గౌడ్ స్పష్టంచేశారు. అధికార పార్టీలో ఉంటూ ప్రభుత్వ స్థలంను కబ్జాచేయవద్దని,ప్రజల ఉపయోగార్థం చేపట్టే అభివృద్ధి పనులకు సహకరించాలని పేర్కొన్నారు.

## కొంపల్లి మున్సిపాలిటీలో అర్బన్ డే




పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న సన్న శ్రీశైలం

**కొంపల్లి, డిసెంబర్ 3, ప్రభాతవార్త**

తెలంగాణ ప్రజా పాలన విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా అర్బన్ డే సందర్భంగా మంగళవారం కొంపల్లి పురపాలక సంఘ పట్టణం యందు వివిధ వార్డులలో ప్రత్యేక పారిశుద్ధ్యము (జివిపి) చెత్త వేసిన ప్రదేశాలలో పరిశుభ్రం చేసి అట్టి ప్రాంతాలలో ముగ్గులు వేసి ప్రజలకు చెత్త బయట వేయకూడదని అవగాహన కల్పించడం జరిగింది. తదుపరి ఉదయం 10:00 గంటలకు ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీని జిల్లా పరిషత్ పాఠశాల, వివిధ కాలనీల నుండి మల్టీ పర్పస్ కొంపల్లి ఫంక్షన్ హాల్ వరకు ప్రజా ప్రతినిధులు, 500 మంది స్వయం సహాయక సంఘాలు, ప్రజలు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, వార్డ్ ఆఫీసర్లు పాల్గొన్నారు. అనంతరం మున్సిపాల్ ఛైర్మన్ సన్న శ్రీశైలం అధ్యక్షతన, మల్టీ పర్పస్ కొంపల్లి ఫంక్షన్ హాల్ నందు (250) మందికి శానిటేషన్ కార్మికులకు హెల్త్ క్యాంప్ నిర్వహించడం జరిగింది. తదుపరి కళాకారులతో పాటలు, విధ్యార్థులతో డ్యాన్స్ ప్రోగ్రామ్, భరత నాట్యం, సంస్క ృతిక కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. తదుపరి పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న ఉత్తమ సిబ్బంది 20మందికి సన్మానించి, 250 పారిశుద్య సిబ్బందికి పిపిఈ కిట్స్ పంపిణీ చేయడం జరిగింది. మెప్మా విభాగానికి సంబంధించిన ఎస్‌హెచ్‌జిలకు కోటి యాభై లక్షలు రూపాయల చెక్, వీధి విక్రయ వ్యాపారులకు ఆరు లక్షల రూపాయల చెక్ అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కె.శ్రీహరి, మున్సిపాల్ ఛైర్మన్ సన్న శ్రీశైలం, వైస్ చైర్‌పర్సన్ రాత్లవాత్ గంగయ్య నాయక్, కౌన్సిల్ సభ్యులు, కొఆప్షన్ సభ్యులు, డిప్యూటీ ఇంజనీర్ ఆర్.నరేష్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ పి. ప్రవీణ్ కుమార్, మున్సిపల్ మేనేజర్ యస్. వెంకటేశం, సీనియర్ అసిస్టెంట్ యస్ రాజు, వైద్యాధికారులు, స్కూలు ఉపాధ్యాయులు, మున్సిపల్ అధికారులు సిబ్బంది, వార్డ్ ఆఫీసర్లు, మెప్మా రిసోర్స్ పర్సన్స్, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న శ్రీశైలం గౌడ్

**పేట్ బషీరాబాద్, డిసెంబరు 3, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం: నిరుపేదల పాలిట సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరంలా మారిందని, ప్రతి ఒక్కరూ సీఎం రిలీఫ్ ఫండ్ వినియోగించుకోవాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందిన ఎస్.నర్సింహారెడ్డి, డి.కృష్ణలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 60,000, 52,500 చెక్కులను ఇద్దరికి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ తన నివాసంలో అందించారు. ఈ కార్యక్రమంలో ఓబిసి డిపార్ట్మెంట్ స్టేట్ కోఆర్డినేటర్ భరత్ గౌడ్, సంజీవ్ కుమార్, లక్ష్మణ్, యువరాజ్, వెంకటస్వామి, భాస్కర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## సమాజంలోని ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలి



పూజ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

**మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబరు 3 ప్రభాతవార్త :**

ప్రతీ వ్యక్తి భక్తి మార్గంలో నడవాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి కంటెస్టెడ్ ఎమ్మెల్యే,మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని బాబుల్‌రెడ్డినగర్‌లో మంగళవారం నిర్వహించిన మదచాల గురు పీఠ రాజయోగ సేవ సమాఖ్య ముఖ్య అనుబంధ పీఠం శ్రీ సదానంద వెంకట రాముల పద మూడవ వార్షిక ఆరాధన పూజ మహోత్సవంలో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఠం సభ్యులకు ఆయన వార్షి కోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. బిజెపి నాయకులు,పీఠం ప్రతినిధులతో పాటుపలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### విఖ్యాత గాయకుడు ఘంటసాలకు గానసభ ఘన నివాళులు

**చిక్కడపల్లి డిసెంబర్ 3 (ప్రభాతవార్త)** విఖ్యాత గాయకుడు ఘంటసాల వెంకటేశ్వర రావు 102 వ జయంతి పురస్కరించుకొని గాన సభ లోని కళా మారుతి కళా వేదిక పై ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపర లో భాగంగా ఘన నివాళులు అర్పించారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన సభలో విశ్రాంత న్యాయ మూర్తి జస్టిస్ కాశీ విశ్వేశ్వర రావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఘంటసాల కేవలం సినీ గాయకుడు మాత్రమే కాదని ఆయన దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని జైలు జీవితం గడిపారని గుర్తు చేశారు ఘంటసాల మరణించి ఏభై ఏళ్ళు దాటినా అయన పాటలు ఇప్పటికీ వినిపిస్తున్నాయి. అని చెప్పారు వేదిక పై ప్రతాప్ వంశీ కృష్ణ బండి శ్రీనివాస్ పాల్గొన్నారు

### ఘంటసాల యుగళ గీతాలగానంతో ఇందు నయన రికార్డు నమోదు



ఇందు నయన కు రికార్డ్ నమోదు ధ్రువ పత్రం ప్రధానం చేసిన దృశ్యం

**చిక్కడపల్లి డిసెంబరు 3 (ప్రభాతవార్త)..**

విఖ్యాత గాయకుడు ఘంటసాల 102 వ జయంతి పురస్కరించుకొని అల్లేయిడ్ ఆర్టిస్ట్స్ ఆడిటోరియం లో గాయని ఇందు నయన 102 యుగళ గీతాలు సహా పురుష గాయకులు తో పాడి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ లో నమోదు చేసుకున్నారు వంశీ ఘంటసాల ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ట్రస్ట్ నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వంశీ రామరాజు పాల్గొని మాట్లాడుతూ చిన్న వయస్సులో సహాస ప్రయోగం చేసిన ఇందు నయన కు మంచి భవిష్యత్ వుంటుందని అభినందించారు రికార్డ్ ప్రతినిధి బింగి నరేంద్ర రికార్డ్ నమోదు ధ్రువ పత్రం అందజేశారు సుంకర పల్లి శైలజ తదితరులు పాల్గొన్నారు

### స్వామి వివేకానంద నగర్ బస్తీ వాసులకు న్యాయం చేస్తా : కమిషన్ ఛైర్మన్ కిషోర్ మక్వాన



జాతీయ కమిషన్ ఛైర్మన్ కలిసిన ప్రతినిధులు

**చిక్కడపల్లి డిసెంబరు 3 (ప్రభాతవార్త):** ముషీరాబాద్ నియోజకవర్గం గాంధీనగర్ డివిజన్ శ్రీ స్వామి వివేకానంద నగర్ బస్తీ వాసులకు న్యాయం చేస్తామని జాతీయ ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కిషోర్ మక్వాన హామీ ఇచ్చారు. శ్రీ స్వామి వివేకానంద నగర్ బస్తీకి చెందిన 19 దళిత కుటుంబాల ఇళ్లను గత జనవరి 29న ,కూల్చివేసిన అనంతరం,, ఓబీసీ మోర్చ జాతీయ అధ్యక్షులు ఎం.పి, డా.కె.లక్ష్మణ్ ప్రత్యేక చొరవ వహించి జాతీయ ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కిషోర్ మక్వాన, మెంబర్ వడ్డేపల్లి రామ్ చెందర్ చర్చించి, బాధిత బస్తి వాసులు ప్రత్యేక్షంగా కలిసి సమస్యను వివరించే విధంగా అపాయింట్మెంట్ కల్పించారు. బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ , బస్తి వాసులు లీ తీ కృష్ణ, జ్ఞానేశ్వర్, ఆనంద్ రావులతో కలిసి న్యూఢిల్లీ లోని కమిషన్ కార్యాలయంలో బస్తి వాసుల ఆవేదనను వ్యక్తం చేశారు. స్పందించిన జాతీయ ఎస్సీ కమిషన్ ఛైర్మన్,19 మంది దళిత కుటుంబాలకు అన్యాయం చేసిన వారిపై చర్యలు తీసుకొని,బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

### విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

-భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ




**అత్తాపూర్ డిసెంబరు3,ప్రభాతవార్త :**

విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలని ట్రాఫిక్ ఎస్ఐ రాజేందర్, భజరంగ్ దళ్ నేతలు పలువురు పేర్కొన్నారు. మంగళవారం నషా ముక్త్ భారత్ డ్రగ్స్ ఫ్రీ ఇండియా క్యాంపెయిన్ మూమెంట్‌లో భాగంగా మైలర్‌దేవ్‌పల్లి బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఎస్టీ ఆంటోనీస్ స్కూల్ విద్యార్థులతో కలిసి డ్రగ్స్‌పై ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ట్రాఫిక్ ఎస్ఐ రాజేందర్, బజరంగ్ దళ్ నేతలు మాట్లాడుతూ....తాత్కాలిక ఉపశమనం కోసం భవిష్యత్తు అంధకారం చేసుకోకూడదని విద్యార్థులకు సూచించారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే నష్టాలు, దుష్ప్రభావాలు, వాటిని అక్రమంగా రవాణా చేయడం వల్ల ఎదురయ్యే చట్టపరమైన చిక్కులపై అవగాహన కల్పించారు. ఎక్కడైన మత్తు పదార్థాలు వాడకం జరుగుతున్నట్లయితే సమాచారం తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బజరంగ్ దళ్ నేతలు మహేందర్,రాహుల్, అజయ్,తదితరులు పాల్గొన్నారు.

## నిజాంపేట్ రాజీవ్ గృహ కల్పకు బస్సు సౌకర్యం



బస్సు లో ప్రయాణిస్తున్న హన్మంత్‌రెడ్డి

**నిజాంపేట్, డిసెంబరు 3, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ రాజీవ్ గృహకల్ప గత 10సంవత్సరాలు బస్సు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతు, గత ప్రభుత్వంలో ఎంతోమంది నాయకులకు విజ్ఞప్తి చేసిన పట్టించుకొనే దాఖలాలు లేకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డిని కలిసి వారి బాధలను విన్నపించుకోగా, కూకట్ పల్లి డిపో మేనేజర్‌తో మాట్లాడి బస్సుసౌకర్యం కలిపించించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు హన్మంత్‌రెడ్డికి మంగళవారం ధన్యవాదాలు తెలిపారు. అనంతరం హన్మంత్‌రెడ్డి మాట్లాడుతు కాంగ్రెస్ హయంలో నిర్మించిన రాజీవ్ గృహకల్ప కాలనీకి మల్లి కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలన సంబరాలలో బస్సు సౌకర్యం కలిగినందుకు ఆనందం వ్యక్తం చేసారు. అలానె ప్రభుత్వ చౌక దారుల దుకాణ సందర్శించి గడిచిన మొదటి సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన ఎలా ఉంది అని అడిగి తెలుసుకున్నారు. ప్రజలు సంతోషం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, మైనారిటీ అధ్యక్షులు అంజద్, లక్ష్మణ్, ప్రభాకర్ రెడ్డి , రాంచందర్ నాయక్, రవి, మర్తమ్మ కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఫుట్‌ఫాత్ పై ఆక్రమణల తొలగించిన ట్రాఫిక్ పోలీసులు



ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

**సికింద్రాబాద్, డిసెంబరు 3, ప్రభాతవార్త :** రోడ్లకిరుపక్కనా పాదచారులు నడిచే స్థలాలను ఆక్రమించి వ్యాపారాలు జరిపితే ఎట్టిపరిస్థితిలో సహించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని చిలకలగూడ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం చిలకలగూడ, వారాసిగూడ పోలీసుతో కలిసి వారాసిగూడ నుంచి ఆర్ట్స్ కాలేజీ రైల్వేస్టేషన్ బస్టాపు వరకు ఆపరేషన్ రోప్‌లో భాగంగా ఫుట్‌పాత్‌లను ఆక్రమణలను తొలగించారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన ఏర్పాటు చేసిన తోపుడు బండ్లు, బోర్డులు, రేకుల షెడ్‌లు, డబ్బాలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేసుకుంటే చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే పలుమార్లు హెచ్చరించామని అయినా ఆక్రమణలు జరిపారని చెప్పారు. ఇలాంటి వాటికి పాల్పడితే చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## 2కే రన్‌లో ఎమ్మెల్యే, మేయర్



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద, మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి

**నిజాంపేట్, డిసెంబరు 3, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన విజయోత్సవాలు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ ముఖ్య అతిథిగా, మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కమిషనర్ సాబేర్ అలి, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు,అధికారులతో కలిసి ప్రగతి నగర్ బతుకమ్మ ఘాట్ నుండి మోర్ సూపర్ మార్కెట్ మీదుగా తిరిగి బతుకమ్మ ఘాట్ వరకు ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు, విద్యార్థులు, మహిళా సంఘాలు, వయోజనులతో కలిసి 2కే రన్ నిర్వహించడం జరిగింది. అదే విధంగా హెల్త్ క్యాంప్‌లో వైద్య పరీక్షలు నిర్వహించుకుని, స్వయం సహాయక బృందాలకు, వీధి వ్యాపారులకు బ్యాంక్ లింకేజీ రుణముల చెక్కులను, మున్సిపల్ కార్మికులకు పీపీఈ కిట్స్‌ను ఎమ్మెల్యే, మేయర్ చేతుల మీదుగా అందించారు. అనంతరం మహిళల ఋతు అవగాహనపై శానిటరీ నాప్కిన్ ఇన్సినేటర్ మిషన్ యొక్క పనితీరును వివరించారు. స్వయం సహాకారక బృందాలచే ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్స్‌ను పరిశీలించిన అనంతరం కార్మికులకు పలు మొక్కలు అందజేసారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు చిట్ల దివాకర్, వెంకట రామయ్య, శ్రీరాములు, ప్రణయ ధనరాజ్ యాదవ్, రవి కిరణ్,ఆవుల పావని జగన్ యాదవ్, గాజుల సుజాత, బాలాజీ నాయక్, లక్ష్మీ కుమారి, రాఘవేంద్ర రావు, కో ఆప్షన్ సభ్యులు తలారి వీరేష్ ముదిరాజ్, సీనియర్ నాయకులు కోలన్ గోపాల్ రెడ్డి, నరసిహ రెడ్డి, ఆవుల జగదీష్ యాదవ్, సీనియర్ నాయకులు, మహిళా సీనియర్ నాయకురాలు సబిత జలంధర్ రెడ్డి, ఎన్ఎంసి ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది ఇతర ముఖ్యులు తదితరులు పాల్గొన్నారు.

## హామీలను నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు క్షమించరు



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నేతలు

**సికింద్రాబాద్, డిసెంబరు 3, ప్రభాతవార్త :** ఆరు గ్యారెంటీల హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు జరుపకుండా ప్రజలను మోసం చేసిందని సికింద్రాబాద్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, బీజేపీ మహంకాళి జిల్లా ప్రధానకార్యదర్శి మేకల సారంగపాణి అన్నారు. ఏడాది పాలన సంబరాల పేరుతో ప్రజాధనాన్ని వృదా చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను విమర్శిస్తూ నియోజకవర్గంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మేస్థితిలో ప్రజలు లేదని అన్నారు. కేవలం సంవత్సర కాలంలోనే ప్రభుత్వం పాలనలో విఫలమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాచమల్ల కృష్ణమూర్తి,అరవింద్ చందుపట్ల, భాస్కర్‌గిరి, రవిప్రసాద్‌గౌడ్, మేకల కీర్తి, శ్యాంసుందర్, ప్రభు గుప్త, సతీష్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ కార్యాయలయం వద్ద నేతల సంబురాలు

**సికింద్రాబాద్, డిసెంబరు 3, ప్రభాతవార్త :** బన్సీలాల్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎల్. వెంకటేషన్ రాజు ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. సనత్‌నగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఎన్నికల్లో విజయం సాధించి సంవత్సరం పూర్తయిన సందర్భంగా స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో సురేష్, మల్లేష్, గజ్జలశ్రీను,వెంకటేష్, శివకు మార్, సుధాకర్‌రెడ్డి,సదానంద్, నర్సిహ్మ,కళ్యాణ్,శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తా : ఎమ్మెల్యే కెపి.వివేకానంద

**జగద్గిరిగుట్ట, డిసెంబరు 3, ప్రభాతవార్త :** 126 జగద్గిరిగుట్ట డివిజన్ శివానగర్‌లో 65 లక్షల రూపాయలతో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని గత రెండు పర్యాయాలు కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పరచామని, అదే అభివృద్ధిని కొనసాగిస్తూ రానున్న రోజుల్లో కూడా మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు. గత పదేళ్ల కాలంలో జరిగిన అభివృద్ధి ప్రజల కళ్ళ ముందే ఉందని, ప్రజా సంక్షేమం కోసం పనిచేసే నాయకులకు ప్రజల ఆశీర్వాదం ఎప్పుడూ ఉంటుంది కనుకే మూడవసారి అఖండ మెజారిటీతో గెలిపించారన్నారు. అలాగే ప్రజల చేత తిరస్కరించబడిన నాయకులు కొందరు తమ వ్యక్తిగత స్వార్థం కోసం, సొంత వ్యాపారాల అభివృద్ధి కోసం, కుటుంబ వ్యాపార అభివృద్ధి కోసం, పార్టీలు మారుతూ నేడు ప్రజల ముందు అసత్య ఆరోపణలు చేస్తూ పిచ్చి ప్రేలాపనులు చేస్తున్నారన్నారు. కుత్బుల్లాపూర్‌లో గత రెండు పర్యాయాలలో దాదాపు 90శాతం పనులు పూర్తి చేసామని ఇంకా ఏమైనా పనులు మిగిలి ఉంటే ప్రణాళిక బద్ధంగా ప్రాధాన్యత క్రమంలో పనులు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, నాయకులు బాబు గౌడ్, శశిధర్, బ్రహ్మానంద చారి, జయకృష్ణ, మల్లేష్ గౌడ్, పాపిరెడ్డి, అజం, ఆంజనేయులు యాదవ్, కిరణ్, ఖయ్యూం, విఠల్, బండ మహేందర్, శివానగర్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నాగరాజుగౌడ్, రాజేశం గౌడ్, విటల్, వెంకటేశ్వర రెడ్డి, రవీందర్, రాజు, వినయ్, అజార్, తుకారం, వెంకట్ రెడ్డి, మహిళా నాయకురాలు సరస్వతి, శాంత, లక్ష్మీ, ఫరానా బేగం, మస్జిద్ ఏ మహమ్మదీయ అధ్యక్షులు అక్బర్, ముర్తుజా, అలీ, మొయిజ్, బస్తి వాసులు పాల్గొన్నారు.



సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

## దుండిగల్ మున్సిపాలిటీలో అర్బన్ డే..



సిబ్బందికి వడ్డిస్తున్న కమిషనర్ సత్యనారాయణరావు

**దుండిగల్ డిసెంబరు 3, ప్రభాతవార్త:** ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం అర్బన్ డే కార్యక్రమంలో ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో 2కె రన్ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద వైద్యశిబిరం ఏర్పాటు చేసి పారిశుధ్య సిబ్బందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. మహిళాశక్తిలో భాగంగా స్వయం సహాయక బృందాలకు రూ,3.42కోట్ల రూపాయల చెక్కులను పంపిణి చేశారు. విధులను సక్రమంగా నిర్వహిస్తున్న పారిశుధ్య సిబ్బందిని గుర్తించి శాలువాతో సత్కరించి ప్రశంసా పత్రాలను అందించారు. అనంతరం సిబ్బందితో కలిసి అధికారులు సామూహిక బోజనాలు చేశారు. కార్యక్రమంలో కమీషనర్ సత్యనారాయణరావు, రెవిన్యూ ఆఫీసర్ ప్రభాకర్, ఏఈ సురేందర్‌నాయక్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ సాత్విక్, శానటరీ ఇన్స్పెక్టర్లు రామచందర్,అంజయ్య,వార్డు ఆఫీసర్లు,చైన్‌మెన్లు,జవాన్లు, స్వయం సహాయక బృందాల సభ్యులు,పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీకాంతాచారి త్యాగం మరువలేనిది : పులిగారి గోవర్ధన్‌రెడ్డి



శ్రీకాంతాచారికి నివాళులర్పిస్తున్న పులిగారి గోవర్ధన్‌రెడ్డి తదితరులు

**ముషీరాబాద్, డిసెంబరు 3, ప్రభాతవార్త:** ప్రత్యేక రాష్ట్ర కోసం తన ప్రాణాలను అర్పించిన శ్రీకాంతాచారి తెలంగాణ చరిత్రలో నిలిచిపోతాడని, ఆయన త్యాగం యావత్ తెలంగాణ సమాజం మరువదని తెలంగాణ పంచాయితీరాజ్ ట్రిబ్యునల్ మాజీ సభ్యులు పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహం వద్ద తెలంగాణ ఉద్యమకారులైన న్యాయవాదులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా 2009 నవంబర్ 29న ఎల్‌బి నగర్ చౌరస్తాలో జరిగిన శ్రీకాంతాచారి ఆత్మాహుతిని గుర్తు చేసుకున్నారు. న్యాయవాదులకు ఆదర్శం డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్: భారతదేశ తొలి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ న్యాయవాదులకు ఆదర్శం అని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి కొనియాడారు. డిసెంబర్ 3 డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ జయంతి సందర్భంగా న్యాయవాదుల దినోత్సవంగా జరుపుకుంటున్నామని గుర్తు చేశారు. ఆనాడు తన న్యాయవాద వృత్తిని సైతం త్యాగం చేసి, స్వతంత్ర్య ఉద్యమంలో పాల్గొని, ఎందరో యువతకు ఆదర్శంగా నిలిచారని అన్నారు.

## ప్రతి మనిషిలో దయా, కరుణా ప్రేమ భావాలు ఉండాలి : హరీష్ రావు



సికింద్రాబాద్ సిఎస్ఐ వెస్లీ చర్చి క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి హరీశ్‌రావ్ తదితరులు

**కంటోన్మెంట్, డిసెంబరు 3 ప్రభాతవార్త:** దేశంలో ఎక్కడా లేని విధంగా క్రైస్తవుల పవిత్ర పండుగను అధికారికంగా జరిపించిన ఘనత తెలంగాణ తొలి ముఖ్య మంత్రి కేసిఆర్‌కే దక్కిందని మాజీ మంత్రి, ససిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావ్ తెలిపారు. గార్డ్ విజన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షుడు నల్లమల్లి సికిందర్ ఆధ్వర్యంలో మంగళవారం సికింద్రాబాద్ సిఎస్ఐ వెస్లీ చర్చిలో నిర్వహించిన మినీ క్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి మనిషిలో దయా, కరుణ,ప్రేమ భావాలు ఉండాలని బోధించిన గొప్ప వ్యక్తి యేసు క్రీస్తూ అని అన్నారు. క్రిస్మస్ వేడుకలు ప్రపంచ వ్యాప్తంగా జరిగే అతి పెద్ద పండుగ అని, అందు వల్ల యేసు క్రీస్తూ మార్గంలో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్ హుసేన్‌లతో పాటు వివిధ జిల్లాలకు చెందిన క్రిస్టియన్లు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో పంపిణీ చేసే అన్నం నాణ్యతగా ఉంది : మాజీ కార్పొరేటర్

**గన్‌ఫౌండ్రి,డిసెంబర్ 3ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందచేస్తున్న మధ్యాహ్నం భోజనం ఫౌష్టికారంగా ఉందని గన్‌ఫౌండ్రి డివిజన్ మాజీ కార్పొరేటర్ పి.మమతసంతోష్‌గుప్త అన్నారు. మంగళవారం కోఠిలోని ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు అందచేస్తున్న మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు వడ్డించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యతో పాటు బాలబాలికలకు ప్రభుత్వం ఉచితంగా మధ్యాహ్న భోజనం ఎంతో రుచిగా,నాణ్యతంగా ఉందన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు మధ్యాహ్నం భోజనాన్ని వడ్డిస్తున్న మాజీ కార్పొరేటర్ పి.మమతసంతోష్‌గుప్త

## కళ్యాణ లక్ష్మి పథకం ఎంతో మేలు : ఎమ్మెల్యే తలసాని



కళ్యాణ లక్ష్మి చెక్కులను అందజేసున్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు

**కంటోన్మెంట్,డిసెంబర్ 3 ప్రభాతవార్త:** పేద, మధ్య తరగతి కుటుంబాలకు కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకం ఒక వరం లాంటిదని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యేక్యాంప్ కార్యాలయంలో బేగంపేట డివిజన్‌కు చెందిన 11 మందికి మంజూరైన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను తలసాని చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడపిల్లల తల్లిదండ్రులకు భారం పడకుండా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసిఆర్ ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకం దేశంలోఎక్కడా లేని విధంగా ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహేశ్వరీ, డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, నాయకులు శ్రీహరి, శేఖర్, హరీఫ్‌లు పాల్గొన్నారు.

## ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలు -సిపిఎం కార్యదర్శి వెంకటేష్





సమావేశంలో ప్రసంగిస్తున్న సీపీఎం కార్యదర్శి ఎం.వెంకటేష్

**ముషీరాబాద్, డిసెంబర్ 3, ప్రభాతవార్త:** కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై సమరసీల పోరాటాలు నిర్వహించాలని మహాసభలో నిర్ణయించటం జరిగిందని సీపీఎం కార్యదర్శి ఎం.వెంకటేష్ తెలిపారు. మంగళవారం ముషీరాబాద్ చౌరస్తాలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నవంబర్ 30 నుండి డిసెంబర్ 1 వరకు భారత కమ్యూనిస్ట్ పార్టీ మార్క్సిస్టు గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ 23వ మహాసభలలో ప్రజా సమస్యలపై చర్చలు జరిపి పలు తీర్మానాలు తీసుకోవటం జరిగిందన్నారు. మహాసభల సందర్భంగా 19మందితో కూడిన నూతన కమిటీని, ఏడుగురితో కార్యదర్శి వర్గాన్ని ఎన్నుకోవటం జరిగిందని, నూతన కార్యదర్శిగా ఎం.వెంకటేష్, కార్యదర్శి వర్గ సభ్యులుగా ఎం.శ్రీనివాస్, ఎం.శ్రీనివాసరావు, ఎం.దశరథ్, ఎం.మహేందర్, కే.ఎన్.రాజన్న, కే.నాగలక్ష్మిలు ఎన్నికయ్యారని, కమిటీ సభ్యులుగా ఆర్.వెంకటేష్, జే.కుమారస్వామి, ఎన్.మారన్న, ఎ.పద్మ, కే.అజయ్‌బాబు, జి.కిరణ్, ఆర్.అశోక్, సి.మల్లేష్, ఎం.అజయ్‌బాబు, జి.నరేష్, వరలక్ష్మి, అశోక్‌రెడ్డిలు ఎన్నికయ్యారని తెలిపారు.

## గగన్‌మహల్ మైదానంలో ఆటల,పోటిలు ప్రారంభం



టిఎన్‌జిఓ ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ

**గోషామహల్,డిసెంబరు3,ప్రభాతవార్త:** ప్రతి యేటా మాదిరగానే ఈ యేడుకూడా ఈ సంవత్సరం డిసెంబర్ 10వ తేది నుంచి టిఎన్‌జిఓ ఉద్యోగుల గగహన్‌మహల్ మైదానంలో 11వ ఆటల,పోటిలను ప్రారంభం అవుతున్నట్లుటిఎన్‌జిఓ సెంట్రల్ కమిటి ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్ హుస్సేనీ తెలిపారు.ఈ మేరకు జిల్లా భవనంలో జిల్లా ఉద్యోగులతోపాటు యూనిట్స్ అధ్యక్ష,కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.ఈపోటిలనురాష్ట్ర బిసి,సంక్షేమశాఖ మంత్రి పొన్నంప్రభాకర్‌గౌడ్ ప్రారంభించనున్నట్లు తెలిపారు.జిల్లా కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టి విచ్చేయనున్నట్లు తెలిపారు.పురుష్యులకు క్రికెట్‌పోటిలు, కబడ్డీ, వాలీబాల్, చెస్,కారోమ్స్ ,టేబుల్‌టెన్నిస్,రంగోలి,సింగింగ్,టాగ్ ఆఫ్ వార్,లెమన్‌స్పూన్ ఉంటాయన్నారు.ఈసమావేశంలో టిఎన్‌జిఓ జిల్లా కార్యదర్శి విక్రమ్,కార్యానిర్వాహక అధ్యక్షులు కె.ఆర్.రాజ్‌కుమార్,కోశాధికారి బాలరాజ్,సభ్యులు ఉమర్‌ఖాన్,కె.శ్రీనివాస్,నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.కాగా తెలంగాణ సాధన కొరకు తన ప్రాణాలను అర్పించిన శ్రీకాంత్‌చారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.

## నాయీ బ్రాహ్మణులను ప్రభుత్వం ఆదుకోవాలి

-తెలంగాణ నాయి బ్రాహ్మణ జీవో పోరాట సమితి నేతల విజ్ఞప్తి



ధర్నాలో నినాదాలు చేస్తున్న తెలంగాణ నాయి బ్రాహ్మణ జీవో పోరాట సమితి నేతలు

**ధర్నాచౌక్, డిసెంబర్ 3, ప్రభాతవార్త:** అన్ని రంగాలలో వెనుకబడి ఉన్న నాయి బ్రాహ్మణులను ప్రభుత్వం ఆదుకోవాలని నాయి బ్రాహ్మణ జీవో పోరాట సమితి నేతలు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ధర్నాచౌక్‌లో తెలంగాణ నాయి బ్రాహ్మణ జీవో పోరాట సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేసించి వారు మాట్లాడుతూ నాయి బ్రాహ్మణ వృత్తి అయిన బార్బర్ వృత్తి మా హక్కు అని, మా వృత్తిలోకి వేరే కులస్థులు రాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్పోరేట్ సెలూన్లు పెరిగిపోవటంతో, వృత్తిపై ఆధారపడి జీవించే పేద నాయి బ్రాహ్మణులకు ఉపాధి లేకుండా పోతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి, కార్పోరేట్ సెలూన్లను నిర్మూలించాలని డిమాండ్ చేశారు. చట్టసభలలో నాయి బ్రాహ్మణులకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో కుకట్‌పల్లి అధ్యక్షులు ఎన్నారం యాదగిరి, కేపీహెచ్‌బీ అధ్యక్షులు పి.రమేష్, నరసింహనాయి, వెంకటేష్, యాదయ్య నాయి, జూబ్లీహిల్స్ నియోజకవర్గ నాయి బ్రాహ్మణ సేవా సంఘం నేతలు జే.సి.శేఖర్, టి.దత్తు నాయి తదితరులు పాల్గొన్నారు.

## 14 దొడ్డి కొమురయ్య ఆత్మగౌరవ భవనం ప్రారంభం

**అఫ్జల్‌గంజ్,డిసెంబర్ 3ప్రభాతవార్త:** తెలంగాణ తొలి అమర వీరుడు,కురుమ యోధుడి దొడ్డి కొమురయ్య కురుమల ఆత్మగౌరవ భవన ప్రారంబోత్సవాన్ని ఈనెల 14వ తేదిన ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షులు,ఎమ్మెల్సీ యెగ్గేమల్లేశం పేర్కొన్నారు. ముస్లింజంగ్ పూల్ సమీపంలో ఉన్న రాష్ట్ర కురుమ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కురుమ సంఘం కార్యానిర్వాహక అధ్యక్షులు,భువనగిరి పార్లమెంట్ బిఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ క్యామ మల్లేష్‌కురుమ సంఘం ప్రతినిధులతో కలిసి ఆయన మాట్లాడుతూ కోకాపేట్ ఫేజ్-3 సిబిఐటి ఇంజనీరింగ్ కళాశాల రహదారిలో నిర్మితమైన దొడ్డి కొమురయ్య కురుమల ఆత్మగౌరవ భవన ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి,కర్నాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య,హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ,బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,ప్రభుత్వ విఫ్ బీర్ల ఐలయ్యకురుమ,మాజీ మంత్రి హెచ్ఎం. రేవన్న, శాసనసభ్యులు ప్రకాష్‌గౌడ్,ఎం.రంగారెడ్డి,అలిండియాపాల్ మహా సభ అధ్యక్షులు సైతాన్‌సింగ్ పాల్లతోపాటు, రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన కురుమ అధికార ప్రతినిధులు,పాల్గొంటారన్నారు.



కురుమ సంఘం సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షులు,ఎమ్మెల్సీ యెగ్గే మల్లేశం కురుమ,కామమల్లేశంలు

ఈ సమావేశంలో తెలంగాణ కురుమ ట్రస్ట్‌బోర్డు కోశాధికారి కెంద్యాల శ్రీనివాస్‌కురుమ, కోశాధికారి కట్టమల్లేశం,కురుమ విద్యార్థిహాస్టల్ కమిటి చైర్మన్ కె.నరసింహ,పుష్పానాగేష్,కొత్తకురుమ శివకుమార్, రాష్ట్ర కురుమ యువ అధ్యక్షులు తూముకుంట అరుణ్ కుమార్,ప్రచార కార్యదర్శి కాలె అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.కాగా 15వ తేదిన దసరా,దీపావళి సమ్మేళనం వద్ద నిర్వహించనున్నట్లు చెప్పారు.

## మానసిక రోగులు,దివ్యాగులకు ప్రత్యేక విభాగం : న్యాయమూర్తి శ్రీదేవి

**ఎల్‌బినగర్, డిసెంబరు 3 ప్రభాతవార్త:** జాతీయ న్యాయ సేవల సంస్థ నిర్దేశాల మేరకు, మానసిక రోగులకు, మానసిక దివ్యాంగుల సేవల కొరకు ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పరుస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి పి. శ్రీదేవి ప్రకటించారు. అంతర్జాతీయ దివ్యాంగ జనుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగులకు సుస్థిర భవిష్యత్తుపై భరోసా అనే అంశంపై మానస చిన్నారుల ఆరోగ్య వైకల్యాలు అధ్యయన సంస్థ, రంగారెడ్డి జిల్లా న్యాయ సేవా సంస్థల సంయుక్త అధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ దివ్యాంగుల హక్కుల సంరక్షణ కొరకు, ప్రబుత్వాలు ప్రకటించిన సంక్షేమ పథకాల సౌలభ్యం అందకపోవటం, దివ్యంగజనులుగా ఉన్న కారణంగా విద్య సంస్థలలో ప్రవేశం లభించకపోవటం వంటి సమస్యలు ఉన్నవారు న్యాయ సేవల కొరకు తమను సంప్రదించవచ్చన్నారు. నిజాయతీగా అమాయకత్వంతో ఉండే దివ్యంగాజనుల హక్కులను సంరక్షించటలో అందరూ చేయూత అందించాలని, వారికి న్యాయ సేవలను అందించటంలో న్యాయ సేవల సంస్థకు సార్థకత చేకూరుతుందన్నారు. జిల్లా పిల్లల సంక్షేమ కమిటీ చైర్మన్‌గా పనిచేసిన పి.శ్యామలాదేవి మాట్లాడుతూ కొద్దిమంది తల్లిదండ్రులు భారం మోయలేమని భావించి దివ్యంగాజనులైన తమ సొంత పిల్లలను వదిలివేయడం గమనించి చాల బాధపడ్డమన్నారు.ఆహార భద్రత ప్రమాణాల జాతీయ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ బాలునాయక్ కేతావత్, అత్తి ప్రభాకర్ మాట్లాడుతూ స్థానికంగా దిరికే వాటిని, ప్రకృతి పరంగా సహజంగా కాలానుగుణంగా లభ్యమయ్యే కాయగూరలను పళ్ళను తప్పనిసరిగా బుజించే ఆహారంలో భాగంగా చేసుకోవటం ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవటంలో ఎంతో తోడ్పాటుతుందన్నారు. దివ్యంగాజనుల జీవన ప్రమాణాలను మెరుగు పరిచే సాంకేతిక పరికరాలు రూపొందించి అవసరమైతే వాటిపై పేటెంటు రిజిస్టర్ చేసుకొనేందుకు సేవా తత్పరత కలిగిన స్వచ్ఛంద సంస్థలు ప్రయత్నించాలని కోరారు.ఈ సందర్భంగా దివ్యంగజన చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఆటల పోటీలలో గెలుపొందిన విజేతలకు అతిథులు బహుమతులు అందించారు.



మానసలో అంతర్జాతీయ దివ్యాంగజనుల దినోత్సవం

### బస్సులను అడ్డగుట్ట మీదుగా నడపాలి : బిజెపి నేత నర్సింగ్ రావ్

**కంటోన్మెంట్,డిసెంబరు3 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ జూబ్లీ బస్టేషన్ నుంచి యాదగిరి గుట్టకు వెళ్లే ఆర్టీసి బస్సులను సంగీత్ చౌరస్తా, మారేడ్‌పల్లి షెనాయ్ నర్సింగ్ హోం, అడ్డగుట్ట, తుకారాంగేట్ ఆర్‌యూబీ, మెట్టుగూడ మీదుగా వెళ్లే విధంగా బస్ సర్వీస్‌లు నడిపితే అటు ఆర్టీసి సంస్థలు, ఇటు ఆ ప్రాంత ప్రయాణికులకు ఎంతో మేలు జరుగుతుందని కోరుతూ అడ్డగుట్ట డివిజన్‌కు చెందిన బిజెపి సీనియర్ నాయకుడు వి.నరిసింగ్‌రావ్ మంగళవారం సికింద్రాబాద్ డిప్యూటీ ఆర్.ఎం. బీమ్‌రెడ్డి,కంటోన్మెంట్ డిపో మేనేజర్ సుధాకర్ రావ్‌లకు వినతిపత్రం సమర్పించారు. ఆర్టీసి అధికారులు సర్వే జరిపి యాదగిరి గుట్టకు వెళ్లే బస్ సర్వీస్‌లను ఆ ప్రాంతాల మీదుగా నడపాలని విజ్ఞప్తి చేశారు.

## 6 గ్యారెంటీలను అమలు చేయాలి : కొంతం దీపిక



కంటోన్మెంట్‌లో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బిజెపి నేతలు కార్పొరేటర్ కొంతం దీపిక తదితరులు

**కంటోన్మెంట్, డిసెంబరు 3 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వ 6 గ్యారెంటీలు అమలు చేయకుండా 66 మోసాలకు పాల్పడుతుందని మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి పిలుపు మేరకు మంగళవారం కంటోన్మెంట్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి బిజెపి నేతలు బారీ ర్యాలీతో ఇందిరా పార్కు తరలివెళ్ళారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ నామినేటెడ్ మెంబర్ జె.రామక్రిష్ణ, ఎస్సీ మోర్చా కన్వీనర్ చిన్న వీరయ్య, మోండా డివిజన్ బిజెపి అధ్యక్షుడు వీరవర్ధన్ గౌడ్, నాయకులు బాలమల్లు, శాలిని తదితరులు పాల్గొన్నారు.

### టివి నటి శోబిత మరణంపై పలు అనుమాలు : బాబాయి బుచ్చిరెడ్డి ఆరోపణ

**అఫ్జల్‌గంజ్,డిసెంబరు 3 ప్రభాతవార్త:** అనుమానస్పధ స్థితిలో మృతి చెందిన కన్నడ,సినీ,టివి నటి శోభిత(32) న్యాయ విచారణ చేయాలని బాబాయిలు బుచ్చిరెడ్డి పోలీసు ఉన్నతాధికారులను కోరారు.కొండాపూర్ శ్రీరాంనగర్ కాలనీలోని సిబ్లాకులో శోభిత ఉరి వేసుకుని ఆత్మహత్య పాల్పడటం పలు అనుమానాలకు తావిస్తుంది.విషయం తెలిసిందే.బాబాయి బుచ్చిరెడ్డి మాట్లాడుతూ సంప్రదాయ కుటుంబం నుంచి వచ్చిందని అందరితోనూ కలగొలుపుగా ఉండేదని పండగల సమయంలో,ఉపవాస దీక్షలు,భక్తి ఎక్కువగా ఉండేదన్నారు.సుధీర్‌రెడ్డి బెంగూళూరులో సాప్ట్వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్న 19నెలల క్రితమే మాట్రిమోని ద్వారా పరిచయమయ్యారని తెలిపారు.రెండు కుటుంబాలు పరస్పర అంగీకారంతో పెళ్లి చేశామన్నారు.కాని ఆమె మరణం వెనుకు పలు అనుమాలు ఉన్నట్లు ఆయన ఆరోపించారు.గచ్చిబౌలి పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


IN THE COURT OF THE HON'BLE II ADDL. JUNIOR CIVIL JUDGE, MEDCHAL DISTRICT, AT MALKAJGIRI
O.S. No. 1092 of 2024

Between:-
Smt. Gorige Nagamani & others ...Plaintiffs
And
The Tahsildar & All Concerned ...Defendants

NOTICE

To,
All Concerned

Take notice that the above named plaintiffs filed the above suit for declaration to declare them as legal heirs of deceased Gorige Venkatesh. The said suit is posted on **05-12-2024** for the appearance of concerned if any who are interested.
Therefore, the concerned herein summoned to appear before the Hon'ble II Addl. Junior Civil Judge, Malkajgiri on **05-12-2024 at 10-30 A.M.,** failing which the above matter will be decided exparte.

// By Order of Court //
T. Sathyanarayana
Advocate
# Shop No.3, Beside Police Station, Medchal Municipality, Medchal Mandal, Medchal Malkajgiri District
Ph: 9848466533

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE CUM JUDICIAL MAGISTRATE OF FIRST CLASS : MALKAJGIRI
O.S.NO. 732 OF 2023

Between:
Allaspur Srinivas ...PLAINTIFF
And
Ajay Vamsi Infratech Pvt Ltd., and Others ...Defendants

To:
1. Ajay Vamsi Infratech Pvt. Ltd., Rep. by its Director L.S. Sunder John, Having its office at: Plot No.39, H.No.10-241/6, Lane No.8, Vasanthapuri Colony, Malkajgiri, Hyderabad, R.R.Dist (Malkajgiri-Medchal Dist, Telangana-47.
3. Guru Surya Prakash Kamakolanu, Director of Ajay Vamsi Infratech Pvt.Ltd., Having its office at : Plot No.39, H.No.10-241/6, Lane No.8, Vasanthapuri Colony, Malkajgiri, Hyderabad, R.R.Dist (Malkajgiri-Medchal Dist, Telangana-47.
...Defendants No.1 & 3

Please take notice that the plaintiff have filed the above suit for **Recovery of money of Rs. 10,10,000/- vide O.S.No.732 of 2023 against the Defendants** and the same is posted for your appearance on **19.12.2024.** Enter your appearace on **19.12.2024** at 10.30 a.m either in person or through your counsel failing which the matter would be decided exparte.
**(By Order of The Hon'ble Court)**
**Sd/- M/s T.Dharma Rao,**
Advocate
Office : Plot No.10, Karkhana Main Road, Opp: Renova Soumya Cancer Center, 1st Floor, Secunderabad-500009.
Email.write2teemula@gmail.com
Cell: 9912838987

వార్త CLASSIFIEDS వార్త

CHANGE OF NAME

★ I, SHAHEEN FATIMA W/o MOHAMMED MAQBOOL R/o H.No. 19-2-369/47, Chandulal Baradari, Bahadurpura, Hyd. Have Changed My Name as "ALIYA FATIMA"

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

